అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం 08 జనవరి 2023

అభ్యాసన సామర్థ్యాన్ని మెరుగుపరచాలి

నవతెలంగాణ-రామారెడ్డి

వెనుకబడిన విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి యోసుఫ్ అన్నారు. మండలంలోని రెడ్డిపేట కాంప్లెక్స్ పరిధిలో గల బట్టు తండా, స్కూల్ తండా, జగదాంబ తండా పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని చదివించి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, పాఠశాల మౌలిక సదుపాయాల కోసం గ్రామపంచాయతీలను సహకారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్పి యోగేందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి పాటుపడతాం


బీసీ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ప్రతినిధులు ఆవిష్కరించారు. మండలంలో, జిల్లాలో బీసీ సంక్షేమ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. బీసీలు రాజకీయంగా ఆర్థికంగా వెనుకబడి పోతున్నారని, వారి అభ్యున్నతికి పాటుపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్వీర్, తాడ్వాయి మండలం బిసి సంఘం అధ్యక్షులు సాయిబాబా, జిల్లా యూత్ అధ్యక్షులు రాజీవ్ కుమార్, ప్రతినిధులు అఖిల్ రావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్న పోరుబాట

- మాస్టర్‌ప్లాన్‌పై తిరుగుబాటు
- విపక్షాల మద్దతు
- జిల్లాలో అధికార పార్టీకి ఇబ్బందికర స్థితి

వీక్లి రౌండప్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కామారెడ్డి జిల్లాలో విలీన గ్రామాలను కలుపుతూ రూపొందించిన మాస్టర్‌ప్లాన్ రగడ ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారింది. రైతాంగ సంక్షేమమే ప్రధాన ప్రచారంగా జాతీయ స్థాయిలో ముందుకు వెళ్తున్న బీఆర్ఎస్‌కు ఇది కొంత ఇబ్బందికరంగా మారింది. అయితే ఇది కేవలం ముసాయిదా మాత్రమేనని, అభ్యంతరాలను స్వీకరిస్తామని అధికార పార్టీ నేతలతో పాటు జిల్లా యంత్రాం గం హామీ నిస్తున్నప్పటికీ.. రైతుల్లో నమ్మకం కుదరడం లేదు. ఎందుకంటే వ్యవసాయమే బతుకు దెరువుగా జీవిస్తున్న రైతులకు తమ భూములు కోల్పోతామోననే భయం నెలకొంది. దీంతో రైతులు తమ పోరాటాలను తీవ్రతరం చేశారు.

కామారెడ్డి జిల్లాలో 8 విలీన గ్రామాలను కలిపి మాస్టర్‌ప్లాన్ ప్రతిపాదించిన విషయం తెలిసిందే. సుమారు 16 వేల ఎకరాలతో ఈ ప్లాన్‌ను రూపొందించారు. అయితే ఈ ప్లాన్‌లో రైతులు భూములు కోల్పోయే పరిస్థితి రావడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఎకర, రెండు ఎకరాలు ఉన్న చిన్న, సన్నకారు రైతులు సైతం భూములు కోల్పోవాల్సి వస్తోందని భయపడుతున్నారు. ఈ మాస్టర్‌ప్లాన్‌పై రైతు ఐక్యకార్యచరణ కమిటీ పేర నిరసనలు చేపడుతున్నారు. గత నెల రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన కొనసాగుతోంది. కానీ ఇటీవల అడ్లూర్ ఎల్లారెడ్డిలో రైతు చనిపోవడంతో ఉద్యమం ఉధృతమయ్యింది. అయితే మొదట రాజకీయ ఉద్యమంగా ప్రారంభమైనప్పటికీ.. ప్రస్తుతం ఇది పూర్తిగా రైతుల చేతుల్లోకి వెళ్లింది. రైతులు స్వచ్ఛందంగా రోడ్లపైకి వస్తున్నారు. ఇటీవల కామారెడ్డి పట్టణ బంద్ కూడా విజయవంతమయ్యింది.

ఎన్నికల ముందు ఎదురుదెబ్బ..

జిల్లాలో సాగుతున్న రైతాంగ ఉద్యమం అధికార పార్టీకి ఎదురుదెబ్బగా మారింది. ఇటీవల బీఆర్ఎస్ ప్రకటన సమయంలో, వివిధ రాష్ట్రాల రైతు నేతల సమావేశంలోనూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో రైతు సంక్షేమ కోసం చేపట్టిన పథకాలు, కార్యక్రమాలు ప్రధానంగా వివరించారు. కానీ జిల్లాలో అందుకు విరుద్ధంగా రైతులు ఆందోళన చేపట్టడం, ఓ రైతు ఆత్మహత్య చేసుకోవడం గమనార్హం. అయితే రాష్ట్రంలో ప్రాజెక్టులకు, కాలువలకు, అభివృద్ధి పనుల పేరిట రైతుల భూములు సేకరించడం కొన్నేండ్లుగా సాగుతోంది. మాస్టర్‌ప్లాన్ పేరిట తమ భూములు సైతం సర్కారు లాక్కొంటోందని రైతాంగంలో భయం నెలకొంది. ఈ భయమే ఉద్యమానికి ఊతమిచ్చింది. ఊహించని ఈ పోరాటంతో ఇటు అధికార పార్టీ సైతం ఇరుకున పడ్డట్టయ్యింది. ఈ యేడాది ఎన్నికల ఉన్న నేపథ్యంలో ఈ పోరాటం చివరకు ఎటు దారితీస్తుందోననే భయం నెలకొంది. మరోవైపు జిల్లాలో విపక్షాలకు ఈ పోరాటం ఆయుధంగా మారింది. ఈ పోరాటంతో తమ బలాన్ని పెంచుకోవాలని బీజేపీ, కాంగ్రెస్ యత్నిస్తు న్నాయి. ఈ ఉద్యమానికి నేతృత్వం వహించేం దుకు బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీ పడుతున్నాయి.


కామారెడ్డి కలెక్టరేట్ వద్ద పోలీస్ బారికేడ్‌లను తొలగిస్తున్న రైతులు (ఫైల్)

రైతాంగంలో విశ్వాసం ముఖ్యం..

మాస్టర్‌ప్లాన్ రద్దు చేయడంతో పాటు రైతులకు భరోసా కల్పించాల్సిన అవసరముంది. భూమి ఆధారంగా జీవిస్తున్న రైతులకు తమ జీవనాధారం కోల్పోతామే భయం నెలకొంది. మొదట ఈ భయాన్ని తొలగించాల్సిన అవసరముంది. అప్పుడే రైతుల్లో సర్కారు పట్ల విశ్వాసం కలుగుతుంది.

గుంట భూమి కూడా తీసుకోం

- కౌన్సిల్ తీర్మానం చేసింది ఒకటి, కన్సల్టెంట్ ఇచ్చింది ఒకటి
- రామేశంపల్లి, హిల్చిపూర్, టేక్రియాల్‌ను ఇండస్ట్రియల్ జోన్ నుంచి తొలగిస్తున్నాం
- అభ్యంతరాలు పరిశీలించి కౌన్సిల్ తీర్మానం చేస్తేనే మాస్టర్‌ప్లాన్ అమలు : విప్ గంపగోవర్ధన్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్


సమావేశంలో మాట్లాడుతున్న విప్ గంపగోవర్ధన్

కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూమి 342 ఎకరాలు ఉందని, దీంతో పాటు వివిధ శాఖలకు కేటాయించగా మిగిలిన భూమి 1777 ఎకరాలు ఉందని, ఇండస్ట్రియల్ జోన్, గ్రీన్ జోన్ లలో ఏ రైతు భూమి గుంట భూమి కూడా తీసుకోబోమని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ తెలిపారు. గత నెలరోజులుగా రైతులు మాస్టర్ ప్లాన్ పై ఆందోళన చేస్తున్న నేపథ్యంలో విప్ స్పందించి శనివారం తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.

మున్సిపల్ సమావేశంలో కౌన్సిల్ తీర్మానానికి వ్యతిరేకంగా బిడిఎఫ్ కన్సల్టెంట్ మాస్టర్ ప్లాన్ ముసాయిదాను తయారుచేసి ఇచ్చిందని అన్నారు. రామేశంపల్లి, హిల్చిపూర్, టేక్రియాల్ గ్రామాలను రెసిడెన్షియల్‌గా కౌన్సిల్ తీర్మానం చేస్తే, కన్సల్టెంట్ ఇండస్ట్రియల్ జోన్‌గా ప్రకటించిందని తెలిపారు. కన్సల్టెంట్‌పై నివేదిక పంపించామని తెలిపారు. 'ప్రభుత్వం తరపు నుండి నేను చెబుతున్నా.. ఈ మూడు గ్రామాల నుండి ఇండస్ట్రియల్ జోన్ ఎత్తివేస్తాము. మేధావులు పెద్దల సూచనల మేరకు కామారెడ్డి పురపాలక సంఘానికి రింగ్ రోడ్ అవసరమని లింగాపూర్ నుండి టేక్రియాల్ వరకు 100 ఫీట్ల రోడ్డు వేసేందుకు ప్లాన్ తీశాం. కామారెడ్డి పురపాల సంఘం రోజురోజు పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు లేకుండా ఉండే విధంగా చౌరస్తా నుండి కేకే వై రోడ్డు నుండి టేక్రియాల్ వరకు కలిపితే రింగ్ రోడ్డు బాగుంటుందని ప్లాన్ చేశాము. మాస్టర్‌ప్లాన్ పై ఇప్పటివరకు 1365 అప్లికేషన్లు వచ్చాయి, అభ్యంతరం స్వీకరించిన తర్వాత పున పరిశీలించి, కౌన్సిల్ తీర్మానం చేసిన తర్వాతే మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని' స్పష్టంచేశారు. రైతులెవరూ అధైర్యపడొద్దని, ఆత్మహత్య చేసుకోవద్దని సూచించారు.

నివాసపు ఇల్లు దగ్ధం



నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తడపాకల్ గ్రామానికి చెందిన ఆరే లక్ష్మీకి చెందిన నివాసపు ఇల్లు శనివారం షాట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఎమ్మార్వో జనార్దన్ ఘటనా స్థలానికి చేరుకొని ఇంటిని పరిశీలించారు. బిరువాలోని దుస్తులు, 15 వేల రూపాయలు మంటల్లో కాలిపోయాయని సుమారు 50 వేల వరకు ఆస్తినష్టం జరిగిందని తెలిపారు. తక్షణ సహాయంగా బాధిత కుటుంబానికి తహసీల్దార్ జనార్దన్, సర్పంచ్ పత్తిరెడ్డి ప్రకాష్ 25 కిలోల బియ్యాన్ని అందించారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దు

కేపే పాల్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్


మాట్లాడుతున్న కేపి పాల్

మాస్టర్‌ప్లాన్‌తో భూములు కోల్పోతామని అధైర్యపడొద్దని, ఆత్మహత్యలు చేసుకోవద్దని ప్రజాశాంతి అధ్యక్షులు కేపి పాల్ అన్నారు. మాస్టర్‌ప్లాన్ రద్దు కోసం రైతులతో పాటు పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని తెలిపారు. రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతు తెలుపుతూ మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలని శనివారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాజకీయ నాయకులు నమ్మి మోసపోవద్దని, కాంగ్రెస్, బీజేపీ నాయకులు రాజకీయ లబ్ది కోసం ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

పోలీసులకు మెడల్స్


మెడల్స్ అందజేస్తున్న సీపీ నాగరాజు

నవతెలంగాణ-కంఠేశ్వర్

75వ స్వాతంత్ర వత్రోత్సవాల సందర్భంగా పలువురు పోలీస్ సిబ్బందికి వచ్చిన మెడల్స్‌ను సీపీ నాగరాజు వారికి ధరింపజేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం 500 మంది పోలీస్ అధికారులకు మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్ ఆఫ్ పోలీస్ వి. అరవింద్ బాబు, అదనపు డి.సి.పి (ఎ.ఆర్) గిరారాజు, నిజామాబాద్ ఎ.సి.పి ఎ. వెంకటేశ్వర్లు, ఎ.ఆర్.ఎ.సి.పి సంతోష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ శ్రీశైలం, సి.ఐలు, ఎస్.ఐలు, ఆర్.ఐలు, ఆర్.ఎస్.ఐలు తదితరులు పాల్గొన్నారు.

సౌత్ క్యాంపస్ విద్యార్థుల ఇండస్ట్రియల్ టూర్


ఐఐసీటీలో భిక్కనూర్ సౌత్ క్యాంపస్ విద్యార్థులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని స్థానిక బి టి ఎస్ చౌరస్తా వద్ద ఉన్న తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని దక్షిణ ప్రాంగణ కెమిస్ట్రీ విద్యార్థులు,అధ్యాపకులు శనివారం హైదరాబాదులోని ఐఐసిటిని సందర్శించారు. అక్కడ జరుగుతున్న పరిశోధనలను ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి విద్యార్థులకు సవివరంగా వివరించారు. అనంతరం శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి నిర్వహిస్తున్న సపారా ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సందర్శించి అక్కడి విశేషాలను తెలుసుకున్నారు. ఫార్మా రంగంలో విద్యార్థులకు గల అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా సౌత్ క్యాంపస్ విద్యార్థులు మాట్లాడుతూ ఇండస్ట్రియల్ టూర్ కి అవకాశం కల్పించిన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్. రవీందర్ గుప్తాకి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్.విద్యావర్ధినికి, హెచ్ ఓ డి డాక్టర్ నాగరాజు అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

తండావాసిపై అటవీ అధికారి దౌర్జన్యం.?

- పెండ్లికి వంటచెరుకు తరలిస్తుండగా ఎండ్లబండి పయ్యలు నరికివేత
- జీవనాధారం కోల్పోయామని బాధితుడి ఆవేదన

నవతెలంగాణ-సిరికొండ

పెండ్లి ఉందని వంట కోసం ఎండిన కట్టెలను తీసుకెళ్తుండగా.. అటవీ అధికారి ఎడ్ల బండి పయ్యను నరికివేసిన ఘటన మండలంలో వర్షిన్ తండాలో చోటుచేసుకోగా.. శనివారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు జంగ్యా వివరాల ప్రకారం.. పెళ్లికి వంట సరుకు నిమిత్తం అడవికి వెళ్లి ఎండిన కట్టెలను తన ఎడ్ల బండి పైన తీసుకొని వస్తున్నాడు. ఇంతలో అటవీ సెక్షన్ అధికారి గంగారెడ్డి ఎడ్ల బండిని ఆపి కట్టెలను ఎవరి అనుమతితో తీసుకువెళ్తున్నావని ఆగ్రహించాడు. అక్కడే ఉన్న గొడ్డలితో బండి చక్రాలలోని ఆకులను మూడింటిని నరికి వేశాడని బాధితుడు తెలిపాడు. తనకు జీవనాధారమైన ఎడ్ల బండి చక్రాలను నరికి వేయడంతో కాళ్లు విరిగినట్లు అయిందని బాధితుడు వాపోతున్నాడు.

ఈ విషయమై సెక్షన్ అధికారి గంగారెడ్డిని నవతెలంగాణ వివరణ కోరగా.. పలుమార్లు అతను ఇదేవిధంగా కట్టెలను ఎడ్ల బండి పైన తీసుకెళ్లి పక్క గ్రామాలలో అమ్ముతున్నాడని సమాచారం రావడంతో అడవికి వెళ్లవద్దని హెచ్చరించాము. ఆయన తమ మాట వినకపోవడంతో ఆగ్రహించి బండి చక్రాలను నరికివేసినట్లు ఒప్పుకున్నారు.



ఎండిన కట్టెలను వంట చెరుకు కోసం తరలిస్తుండగా.. ఎడ్లబండి పయ్య ఆకులను నరికిన అధికారి

గతంలో అటవీ ప్రాంతంలోనే సామిల్ మిషిన్ ఏర్పాటు

గతంలో మండలంలోని మీరాబాయి తండాలో అటవీ అధికారులు దగ్గరుండి అడవిలో సామెల్ మెషిన్ బిగించి, యథేచ్ఛగా కట్టెలు కోసి చెక్కులను అమ్ముకున్నారని తండా వాసులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం గ్రామస్తుల ద్వారా వెలుగులోకి రావడంతో తమ తప్పును కప్పిపుచ్చుకోవడం కోసం నామమాత్రంగా చిన్న తరగతి ఉద్యోగిపై వేటు వేసినట్టు చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన జగ్యా ఎడ్ల బండి పైన ఎండిన కట్టెలను వంట సరుకు నిమిత్తం తీసుకొని వస్తే తప్పు చేసిన వారిలాగా ఆగ్రహానికి గురై బండి చక్రాలు నరికి వేయడం ఎంతవరకు సమంజసమని తండా వాసులు ప్రశ్నించారు. తమకు ఒక న్యాయం ఇతరులకు ఒక న్యాయమా అని అటవీ అధికారులను ప్రశ్నిస్తున్నారు. అధికారులు కట్టెలు అమ్మితే తప్పులేదు గాని వంట చేసేందుకు ఎండిన కట్టెలను తెచ్చుకుంటున్న వారిపై దౌర్జన్యం చేయడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి జీవనాధారానికి దెబ్బకొట్టిన సెక్షన్ అధికారి గంగారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలి




కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

- మ్యానువల్‌గానే ఎత్తు కొలవాలి.. లాంగ్ జంప్ దూరం తగ్గించాలి
- డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్ఐ , కానిస్టేబుల్ ప్రవేశ పరీక్షల్లో జరిగిన అవకతవకలను సరిచేసి హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ప్రశ్నాపత్రంలో తప్పుగా వచ్చిన ఏడు ప్రశ్నలకు అభ్యర్థులందరికీ ఏడు మార్కులు కలపాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈవెంట్స్ సెలక్షన్ లో ఎత్తును కొలిచేందుకు తీసుకువచ్చిన డిజిటల్ విధానాన్ని రద్దు చేసి పాత మాన్యువల్ పద్ధతుల్లోనే కొనసాగిం చాలని, లాంగ్ జంప్ 3.8 మీటర్స్ నుండి 4 మీటర్స్‌కి పెంచడాన్ని వెనక్కి తీసుకొని 3.8 మీటర్స్‌నే కొనసాగిం చాలని డిమాండ్ చేశారు. 1600/800 మీటర్స్ రన్‌ను చేదించిన అభ్యర్థులను మెయిన్స్ ఎగ్జామ్‌కు అనుమతించాలని కోరారు. డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పిట్ల నరేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్ మాట్లాడారు. పోలీస్ అభ్యర్థుల సెలక్షన్ విషయంలో పరీక్షలు నిర్వహించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టిఎస్ఎల్ పిఆర్‌బి ఘోర వైఫల్యం చెందిందని తప్పును సర్దిపుచ్చుకోవడానికి మొండి ధోరణితో ముందుకు వెళుతుందని అన్నారు. తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులను సైతం పెడచెవిన పెట్టి ఎస్సై కానిస్టేబుల్ అభ్యర్థులకు అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. ఈ రిక్రూట్మెంట్ విషయంలో జరిగిన అవకతవకలను సరిచేసి వెంటనే అభ్యర్థులకు న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎస్సై ,కానిస్టేబుల్ , అభ్యర్థులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్ది సూరి, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి పి మహేష్, యువజన విద్యార్థి సంఘం నాయకులు హెచ్ సాయినాథ్, విశాల్, కిరణ్, పోలీసు అభ్యర్థులు సాయి, భీమశంకర్, లు పాల్గొన్నారు.

18 నుంచి కంటి వెలుగు


మాట్లాడుతున్న సుదర్శనం

నవతెలంగాణ-ఆర్మూర్

ఈ నెల 18 నుండి ప్రారంభమయ్యే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుదర్శనం అన్నారు. దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం కంటి వెలుగుపై ఆరోగ్య కార్యకర్తలకు ఆశా కార్యకర్తలకు ఆరోగ్య పర్యవేక్షకులకు శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దృష్టిలోపం ఉన్న వారిని గుర్తించి కంటి వెలుగు శిబిరానికి తీసుకువచ్చి కంటి పరీక్షలు జరిపించి తగు కళ్ళజోడిని ఇప్పించి విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శివ దాస్, జై సి సువేత, వైద్యాధికారులు పూజా రెడ్డి, ప్రవీణ, రోషిని, పి హెచ్ ఎస్ స్వరూప, హెచ్ ఈ ఓ లు కాంతయ్య, రవి, ఆరోగ్య పర్యవేక్షకులు సుభాష్, అజీమా, ఆరోగ్య ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఇవ్వండి.. ఆందోళన చెందొద్దు

- ఇది డ్రాఫ్ట్ మాత్రమే.. మార్పులు, చేర్పులకు అవకాశం ఉంది
- మాస్టర్‌ప్లాన్‌పై కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ప్రెస్‌మీట్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్


మాట్లాడుతున్న కలెక్టర్

మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాలు ఉంటే జనవరి 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు వరకు ఇవ్వొచ్చని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. ఇది కేవలం డ్రాఫ్ట్ మాత్రమేనని, మార్పులు చేర్పులకు అవకాశం ఉందని కావున ఎవరూ ఆందోళనకు గురికావొద్దని సూచించారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో శనివారం కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.

వివరాలు మెయిన్‌లో..

బాబుకు జన్మనిచ్చి తల్లిమృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి : కుటుంబీకుల ఆందోళన



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబీకులు




నవతెలంగాణ-ఆర్మూర్

బాబుకు జన్మనిచ్చి తల్లిమృతిచెందిన ఘటన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఆస్పత్రిలో శనివారం చోటుచేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతిచెందిందని ఆరోపిస్తూ కుటుంబీకులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్‌కు చెందిన శ్రీలత(27)కు పురిటి నొప్పులు రావడంతో ఆర్మూర్‌లోని వంద పడకల ఆస్పత్రికి శుక్రవారం సాయంత్రం తీసుకువచ్చారు.

వివరాలు మెయిన్‌లో..

తెలుగు కవుల సేవలు మరువలేనివి

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు రమణచారి


కార్యక్రమంలో మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-దోమకొండ

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం బాషా పరిరక్షణ కోసం కృషి చేస్తున్న తెలుగు కవుల సేవలు మరువలేనివని విశ్రాంత ఐఏయస్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు రమణ చారి అన్నారు. కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో గడికోట సంస్థనాధిషులు కామినేని అనిల్ ఆధ్వర్యంలో తెలంగాణ సాహిత్యం, తెలుగు కవుల ఆత్మీయ సమ్మేలనం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు.

వివరాలు మెయిన్‌లో..

డిచ్‌పల్లి పీఎంపీ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలో పీఎంపీ అసోసియేషన్ మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా శ్యామ్ (రాంపూర్ డీ), ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్ (సుద్దులం), ప్రధాన కార్యదర్శిగా చాంద్ పాషా (దూసుగాం), క్యాషియర్‌గా కుమార్ (మిట్టపల్లి), జాయింట్ సెక్రటరీగా రాజకుమార్ షిండే (డిచ్‌పల్లి), ఆర్గనైసింగ్ సెక్రటరీగా శ్రీనివాస్ (రాంపూర్ డీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి వ్యవస్థపాక, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు పుల్గం మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు రవివర్మ, కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్, జిల్లా సెక్రటరీ గోపి, కార్యవర్గ సభ్యులు పల్లెరాజు పాల్గొని కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తాజా మాజీ అధ్యక్షులు గోపి, జిల్లా సెక్రటరీగా ఎన్నికైనందున ఈ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

సబ్ జూనియర్ బాయ్స్ ఉమ్మడి జిల్లా హాకీ జట్టు ఎంపిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ హాకీ ఆదేశాల మేరకు ఈ నెల జనవరి 21,22,23వ తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో రాష్ట్రస్థాయి హాకీ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిజామాబాద్ జిల్లా హాకీ సంఘం అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, కోశాధికారి పింజ సురేందర్ శనివారం తెలియజేశారు. ఈ పోటీలలో పాల్గొనే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టును ఈనెల 9వ తేదీన ఉదయం 7గంటలకు ఆర్మూర్‌లోని మినీ స్టేడియంనందు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సబ్ జూనియర్ బాయ్స్ హాకీ జట్టు ఎంపిక ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు విధిగా వెంట తీసుకురావాలని, ఇందులో పాల్గొనే క్రీడాకారులు 01-01-2007 తరువాత జన్మించి ఉండవలెనని తెలియజేశారు. వివరాలకు 9848426821 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

విపత్తుల సమయంలో

ఎన్‌డీఆర్‌ఎఫ్ పాత్ర క్రియాశీలకం

- అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్
- ఆకట్టుకున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ మాక్‌డ్రిల్

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

అనుకోని రీతిలో విపత్తులు సంభవించిన సమయాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) నిర్వర్తించే పాత్ర ఎంతో క్రియాశీలకమైనదని అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ ప్రశంసించారు. విపత్తులు సంభవించినప్పుడు ఎన్‌డీఆర్‌ఎఫ్ ఎలా స్పందిస్తుంది. ఎలాంటి పాత్ర పోషిస్తుందనే అంశాలపై అవగాహన కల్పించేందుకు శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని క్రీడా అథారిటీ మైదానంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, వివిధ శాఖల అధికారులు, స్థానికులు ఎంతో ఆసక్తితో మాక్‌డ్రిల్‌ను తిలకించారు. ప్రకృతి పరంగా లేదా మానవ తప్పిదాల వల్ల విపత్తులు సంభవించిన సందర్భాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ నిర్వర్తించే విధుల గురించి మాక్‌డ్రిల్ ప్రదర్శన ద్వారా కండ్లకు కట్టినట్టు చూపించారు. ముఖ్యంగా పేలుళ్లు సంభవించినప్పుడు, ప్రమాదకర రసాయనాలు విడుదలైన సందర్భాల్లో ఎలా వ్యవహరిస్తారు, ఎలాంటి పరికరాలు వినియోగిస్తారు, ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని ఎలా కాపాడతారు అన్నది ప్రయోగాత్మకంగా ఆకట్టుకునే రీతిలో ఆచరణాత్మక విధానంలో చేసి చూపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విపత్తుల సమయాల్లో నష్ట నివారణ కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ ఎంతో సాహసోపేతంగా విధులు నిర్వర్తిస్తుందని అన్నారు. విపత్తుల్లో చిక్కుకున్న వారికి భరోసాను అందిస్తోందన్నారు. గత పక్షం రోజులుగా విజయవాడ కేంద్రంగా విధులు నిర్వర్తించే ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ ప్రదర్శనలు నిర్వహించి విద్యార్థులకు, ప్రజలకు విపత్తుల పట్ల అవగాహన కల్పించారని పేర్కొన్నారు. ప్రమాదాలు, విపత్తులు జరిగినప్పుడు సాధారణ పౌరులు కూడా తమవంతు బాధ్యతగా తక్షణమే స్పందించాలని, పోలీస్, అగ్నిమాపక శాఖలకు సమాచారం అందించాలని అదనపు కలెక్టర్ హితవు పలికారు. ఎంత త్వరగా స్పందిస్తే, అంత ఎక్కువగా ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులను జిల్లా యంత్రాంగం తరపున అదనపు కలెక్టర్ శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఆర్డీఓ రవి, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ బిటెన్ సింగ్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మధుసూదన్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుదర్శనం, డీఐఈఓ రఘురాజ్, నగర పాలక సంస్థ అధికారులు అఫ్జల్ అలీం, సాజిద్, తహశీల్దార్లు సుదర్శన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్



పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్న బృందం

వేధింపుల తాళలేక వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

భర్త, అత్తమామ వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన కర్రోల్ల నరేష్‌కు పుప్పాలపల్లి గ్రామానికి చెందిన నిఖిత (26)తో ఆరు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుర్లున్నారు. కాగా భర్త, అత్తమామ వేధించడంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో పట్టపగలే చోరీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని అన్నపూర్ణ కాలనీలో శనివారం మధ్యాహ్నం తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. దుండగులు వెంకటేష్ గౌడ్ అనే వ్యక్తి ఇంట్లో చొరబడి రెండు బీరువాలు ధ్వంసం చేశారు. రూ.25వేల నగదు దొంగిలించుకుపోయారు.

20వ రోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ జిల్లా సాధనకై బోధన్ పట్టణంలో న్యాయవాదుల ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలు శనివారం నాటికి 20వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో విద్యార్థి జేఏసీ నాయకులు శివకుమార్, పాల్దే శంకర్, గంగారెడ్డి దీక్షలో పాల్గొన్నారు. దీక్ష శిబిరాన్ని మాజీ కౌన్సిలర్ రాజ్ విఠల్ సందర్శించి దీక్షలకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు సీహెచ్.వి.హనుమంతరావు, అర్జున్ రండర్, ఈశ్వర్, టి.శంకర్, భానోత్ రమేష్, ధర్మయ్య, అడ్లూరి శ్రీనివాస్, అజయ్, శేఖర్, న్యాయవాదుల గుమస్తాలు జమ్మర్‌ఖాన్, హన్మండ్లు, ఖైసర్, బోధన్ రైల్వే విద్యార్థి జేఏసీ నాయకులు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల కోసం స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్ చేపడుతున్న అధికారులు

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రంలో పంచాయతీ పన్నుల కోసం పంచాయతీ అధికారులు శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు పాల్గొని గ్రామంలోని దుకాణ సముదాయాల వద్దకు పంచాయతీ సిబ్బందితో కలిసి డ్రైవ్‌లో పాల్గొని మాట్లాడారు. నేటి వరకు 46 శాతం పన్నులు వసూలైనట్టు తెలిపారు. రానున్న మార్చి నాటికీ 100 శాతం పన్నులు వసూలు చెయ్యాలని సిబ్బందిని ఆదేశించారు. ఇందుకు వ్యాపారులందరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజేష్, సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాలరాజ్, సితాయిపేట, గుడి తండా, ధర్పల్లి, కోట్లపల్లి గ్రామాల కార్యదర్శులు సాయి, బాలకృష్ణ, సైఫొద్దీన్, దాసు, పంచాయతీ సిబ్బంది శశాంక్, సమేందర్, రాజేందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కోలిప్యాక్ సింగిల్ విండో సొసైటీని సందర్శించిన తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని జక్రాన్‌పల్లి మండలం కొలిప్యాక కోపరేటివ్ సొసైటీని తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మారా గంగారెడ్డి సందర్శించారు. అనంతరం మండలంలోని చింతలూరు గ్రామంలోని ఆదర్శ రైతు చిన్ని కృష్ణుడు తన సొంత వ్యవసాయ భూమిలో అమ్మానాన్న చిత్రపటాన్ని వరి ద్వారా నాటిన వ్యవసాయ భూమిని పరిశీలించి ఆయనను అభినందించారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర మార్కెట్ చైర్మన్ మాట్లాడుతూ.. తన సొంత గ్రామమైన ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాన్ని వరి ద్వారా నాటాలని ఆదర్శ రైతు చిన్ని కృష్ణుడికి సూచించారు. చిన్ని కృష్ణుడు దానికి అంగీకరించి సంబంధిత వరి విత్తనాలను మొలక చేసి 20 రోజుల్లో కేసీఆర్ చిత్రపటాన్ని అంకాపూర్ గ్రామంలో వ్యవసాయ క్షేత్రంలో వరి ద్వారా నాటనున్నట్టు తెలిపారు. అనంతరం కోలిప్యాక్ సింగిల్ విండో నూతన చైర్మన్‌గా ఎన్నికైన నాగుల శ్రీనివాసును శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొలిపాక సొసైటీ చైర్మన్ శ్రీనివాస్, సీఈవో స్వామి తదితరులు పాల్గొన్నారు.



చిన్నిక్రిష్ణుడితో మాట్లాడుతున్న చైర్మెన్

బోధన్ రూరల్ ఎస్‌ఐ సందీప్‌కు ఉత్తమ పోలీస్ మెడల్

నవతెలంగాణ-బోధన్

బోధన్ రూరల్ ఎస్‌ఐ లోకం సందీప్ విధి నిర్వహణలో కనబరిచిన సేవలకు గానూ ఫ్రెండ్లీ పోలీస్ అమలు చేసినందుకుగానూ శనివారం జిల్లా కేంద్రంలో 75వ స్వాతంత్ర వజ్రోత్సవాల సందర్భంగా పోలీస్ కమిషనర్ నాగరాజు ఆయనకు ఉత్తమ పోలీస్ మెడలును ప్రదానం చేశారు. అలాగే బోధన్ పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ ఉత్తమ సేవలకు గాను పోలీస్ కమిషనర్ నాగరాజు ఉత్తమ మెడల్ ప్రదానం చేశారు. ఉన్నత అధికారుల సూచనలు, ఆదేశాల మేరకు తమ విధి నిర్వహణను సక్రమంగా నిర్వహించినందున తమ సేవలకు ప్రభుత్వం గుర్తించి ఉత్తమ పోలీస్ మెడల్ ప్రదానం చేయడంతో తమకు మరింత బాధ్యతలు పెంచిందని సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్‌ఐ సందీప్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రవీందర్ బాబు, అదనపు డీసీపీ(ఏఆర్) రారాజు, నిజామాబాద్ ఏసీపీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఎస్‌ఐ సందీప్‌కు మెడల్ ప్రదానం చేస్తున్న సీపీ నాగరాజు

త్వరలో టీడీపీ భారీ బహిరంగ సభ



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలో త్వరలో టీడీపీ బహిరంగ సభను నిర్వహించనున్నట్టు తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదగౌడ్, నాయకులు పార్టీ కార్యాలయంలో కాసాని జ్ఞానేశ్వర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహిరంగ సభను విజయవంతం చేయడానికి పార్టీ నాయకులతో, ముఖ్య నాయకులతో చర్చలు జరిపి, సాధ్య అసాధ్యలను చర్చించి, త్వరలోనే అధికారికంగా బహిరంగ సభ తేదీని ప్రకటిస్తామని రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బక్కిని నర్సింలు, ఖమ్మంపటి రామ్మోహన్, నన్నూరి నర్సిరెడ్డి, కంద్రాగడ్డ ప్రసూన, రాష్ట్ర నాయకులు, నిజామాబాద్ పార్లమెంట్ ముఖ్య నాయకులు రేంజర్ల సురేష్, వినోద్ కుమార్, జ్యోతి నారాయణ, మనుకా ప్రవీణ్, గోపాల్ రెడ్డి, కోయేడి నర్సింలు, అంబికా సత్య నారాయణ, దంతాల ఆనంద్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ స్థలంలో ఎక్కువ సాగు..

నవతెలంగాణ-ఎడపల్లి

గ్రామీణ ప్రాంతాల నేపథ్యం, పంట పొలాల సాగుబడి, కూరగాయల సాగు తదితర అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలనకు ఎడపల్లి బాలికల గురుకుల పాఠశాల ఉపాధ్యాయ బృందం మండలంలోని జైతాపూర్ గ్రామానికి శనివారం వెళ్లారు. తక్కువ స్థలంలో వివిధ రకాల కూరగాయలు, పండ్ల మొక్కలను ఏ విధంగా సాగుచేయాలో రైతులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ఆదర్శ రైతు జైతాపూర్ గ్రామానికి చెందిన కరటూరి పాపారావు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి ఉపాధ్యాయ బృందం సాగు వివరాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా సేంద్రియ పద్ధతి ద్వారా తక్కువ నీటితో, ఎక్కువ దిగుబడినిచ్చే కూరగాయల రకాలను అడిగి తెలుసుకున్నారు. పాపారావు వ్యవసాయ క్షేత్రంలో పావు ఎకరం స్థలంలో 30 రకాల కూరగాయల మొక్కలను ఏ విధంగా సాగు చేస్తున్నారో వివరాలు సేకరించారు. తక్కువ స్థలంలో సాగుచేసే పద్ధతులను తెలుసుకొని అవగాహన పెంచుకున్నారు. గురుకుల పాఠశాలలో ఇలాంటి నర్సరీలను ఏర్పాటు చేసుకుంటే విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడతాయని ఆదర్శ రైతు పాపారావు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఇలాంటి పర్యటనలో మరిన్ని చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ సుహాసినిరెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా రైతుల పండించ పంటలను, సాగు పద్ధతులను తెలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా సేంద్రీయ పద్ధతి ద్వారా కూరగాయలను పండించే అధిక పోషకాలను పొందడం ఇలాంటి పద్ధతులను పరిశీలించడం సంతోషం కలిగించిందని ఆమె అన్నారు. ఉపాధ్యాయులు నాగలక్ష్మి, మంజుశ్రీ, రేణుక, ఫరహన బేగం, పాఠశాల కళాశాల సిబ్బంది గంగారాం తదితరులున్నారు.



ఆదర్శ రైతు పాపారావుతో మాట్లాడుతున్న గురుకుల పాఠశాల కళాశాల ఉపాధ్యాయ బృందం

సాంప్రదాయాలతోనే సంస్కారం

- బోధన్ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా

నవతెలంగాణ-నవీపేట్/ఎడపల్లి

సాంప్రదాయాలతోనే సంస్కారం అలవాటవుతుందని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ సతీమణి ఆయేషా ఫాతిమా అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంతో పాటు మండలంలోని నాగేపూర్ గ్రామాలలో ముగ్గుల పోటీలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయేషా ఫాతిమా మాట్లాడుతూ.. అన్ని మతాల సంస్కృతి, సాంప్రదాయాలతో సంస్కారం అలవడుతుందని అన్నారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు సుమారు 40 మంది మహిళలకి ప్రశంస బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్, సర్పంచ్‌లు ఏటీఎస్ శ్రీనివాస్, స్వరూప మహిపాల్, జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, జెడ్పీటీసీ సవిత బుచ్చన్న, బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్ రావు, అబ్బన్న, తెడ్డు పోశెట్టి, లహరి ప్రవీణ్‌కుమార్, ఉప సర్పంచ్‌లు కరిపే మల్లేష్, శ్రీకాంత్‌రెడ్డి, లోకం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



నవీపేట్ : ముగ్గులను పరిశీలిస్తున్న ఆయేషా ఫాతిమా

సాంప్రదాయ పండుగలను ఆనందంగా జరుపుకోవాలి

ఎడపల్లి : సాంస్కృతిక, సాంప్రదాయ పండుగలను మహిళలు ఆనందంగా జరుపుకోవాలని బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సతీమణి ఫాతిమా అయేషా బేగం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ముగ్గుల పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని వేసిన ముగ్గులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.శ్రీనివాస్, జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్, టీఆర్ఎస్ ఎడపల్లి మండల అధక్షులు శ్రీరామ్, ఎంపీటీసీలు మనిషారెడ్డి, పద్మ ముత్తన్న, నాయుడు స్రవంతి పోతన్న, వనజ నాగరాజు, ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంపీఓ సుభాష్ చంద్రబోస్, సూపరింటెండెంట్ మనోహర్ రెడ్డి, ఏపీవో గంగారాం, ఐకేపీ ఏపీఎం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. మండల విద్యాధికారి ఆంధ్రయ్య, ఐసీఐసీఐ ఫౌండేషన్ ఈటీ అఖిల మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అకిల మాట్లాడుతూ.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతుల ఆర్థికాభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలు పాఠశాలల్లో వర్షపు నీరు వృథా చేయకుండా వర్షపు నీటిని నిలువ చేసి వాడుకునే వ్యవస్థ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అందులో భాగంగా విద్యార్థుల సౌకర్యార్థం అదనపు శౌచాలయం కోసం భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి కూడా చర్యలు చేపడతామని తెలిపారు. విద్యార్థులు చదువులో మంచిగా రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బద్దం రాజేష్, సభ్యులు, ఐసీఐసీఐ ఫౌండేషన్ సీఎఫ్ చింత శ్రీనివాస్, మధు, దేవేందర్, సయ్యద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న దృశ్యం

సీసీ రోడ్లు వేయించాలని తీర్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని నడ్పల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో మిగిలిపోయిన సీసీ రహదారులను వేయించాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. శనివారం సర్పంచ్ కులచారి సతీష్‌రావు అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులు సకాలములో చెల్లించి గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలన్నారు. ఫిష్ మార్కెట్‌ను రోడ్లపై పెట్టకుండా చెరువు కట్ట వైపు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. గ్రామంలోని నడిపల్లి, రైల్వేస్టేషన్, గాంధీనగర్‌లో పారిశుధ్యం ప్రతిదినం సక్రమంగా నిర్వహించాలని, చెత్తచెదారం ఉండకుండా చూడాలని అన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ అజార్ పాషా, మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఇంచార్జీ ఎంపీఓ నిట్టు కిషన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ రజాత్, బిల్ కలెక్టర్లు సంతోష్, రాము తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పాలకవర్గం

తెలంగాణ టీచర్స్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా విద్యా శాఖాధికారి దుర్గాప్రసాద్ చేతుల మీదుగా తెలంగాణ టీచర్స్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పెంట జలంధర్, ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల రిలే నిరాహారదీక్షలు

- జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూర్ చక్రపాణి



వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మికులు, నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వచ్చే నెల 18 నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నామని జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూర్ చక్రపాణి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి రాజా గంగారాంకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెంచిన స్లాబ్ రేటు కూడా ప్రభుత్వం జీఓ విడుదల చేయాలని, అక్టోబర్, నవంబర్ డిసెంబర్ 3 నెలల బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలరాజు, మనోహర్, సులోచన, వడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

నల్లవెల్లిలో అన్నదానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలోని సిద్దుల గుట్టలో శనివారం జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానం నిర్వహించినట్టు గ్రామ అభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ నోముల విజయలక్ష్మి లక్ష్మారెడ్డి తెలిపారు. జాతర సందర్భంగా ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబరి మోహన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చందూర్‌లో పారిశుధ్య పనులు

నవతెలంగాణ-వర్ని

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులను చేపడుతున్నారు. అందులో భాగంగా శనివారం గ్రామంలోని సర్పంచ్ కర్ణం సాయిరెడ్డి సమక్షంలో మన ఊరు మన వార్డు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వాడవాడలో పారిశుధ్య పనులను చేయించారు.

కేజీబీవీల్లో కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్‌కు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని, కనీస వేతనాల చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం కోటగల్లీలోని ఎన్.ఆర్ భవన్‌లో ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 13న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం.ముత్తెన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి డి.కిషన్, ఆర్.రమేష్, జిల్లా నాయకులు బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌లు లేక వైద్యం అందట్లే



నవతెలంగాణ-పిట్లం

ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌లు సరిపడా లేక వైద్యం అందడం లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి బొర్గి సంజీవ్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. పిట్లం ఆస్పత్రిని 30 పడకలకు అప్‌గ్రేడ్ చేసినప్పటికీ సరిపడా వైద్య సిబ్బందిని నియమించలేదని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఇదే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ఆసుపత్రులలో వైద్యులు సిబ్బందిని నియమించి వైద్యం అందించాలని, లేకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

జగన్‌ను కలిసిన ఐడీసీఎంఎస్ చైర్మన్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్‌ను తన నివాసంలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఐడీసీఎంఎస్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ సంబారి మోహన్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంబారి మోహన్

తాగునీటి పరిష్కారానికి బోరు పనులు



బోరు తవ్వకం పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-రామారెడ్డి

తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోరు పనులను శనివారం స్థానిక ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి, స్థానిక సర్పంచ్ దండబోయిన సంజీవ్, ఎంపిటిసి రజిత రాజేందర్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దశరథ్‌రెడ్డి మాట్లాడుతూ.. మండల ప్రజా పరిషత్ ఎంపీటీసీ నిధుల నుండి నీటి ఎద్దడిని పరిష్కరించడానికి బోరు తవ్వకాలను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీందర్ రావు, రైతుబంధు మండల అధ్యక్షులు నారాయణరెడ్డి, మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు రవీందర్ గౌడ్, ఉప సర్పంచ్ ప్రసాద్, మండల యూత్ అధ్యక్షులు గడ్డం రవీందర్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ సిద్ధ రాములు, కాలభైరవ స్వామి ఆలయ కమిటీ డైరెక్టర్ ఇస్సాయిపేట భైరయ్య, నాయకుడు జంగం లింగం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని స్థానిక గిద్ద హరిజనవాడలో ఉన్న మాతమ్మ ఆలయ పునర్నిర్మాణానికి పట్టణ ఉపసర్పంచ్ బోడ నరేష్ శనివారం ఆలయ కమిటీ సభ్యులకు తన వంతుగా 5వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తునికి వేణు, వార్డు సభ్యులు రవి,సత్తూరి బాలరాజు, ఆలయ కమిటీ సభ్యులు పొట్టి గిని లక్ష్మణ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



పిల్లలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

నవతెలంగాణ-జుక్కల్

గర్భిణిలు, బాలింతలు తప్పక పౌష్టికాహారం తీసుకోవాలని చిన్నఎడ్గి అంగన్‌వాడి టీచర్ చంద్రకళ అన్నారు. శనివారం అంగన్‌వాడి సెంటర్‌లో సర్పంచ్ శాలీని పటేల్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు బరువు, ఎత్తును పరిశీలించి తూకం వేసి రికార్డులో నమోదు చేశారు. పౌష్టికాహారం లోపం ఉన్న పిల్లలను ప్రత్యేకంగా గుర్తించి బూస్టర్‌డోస్ బాలమృతం అందించనున్నట్టు తెలిపారు. అదేవిధంగా ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు తాజావి వాడాలని, గుడ్లు, పెరుగు, పాలు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎమ్ యాదమ్మ , సావిత్రి , ఆశాలు భారతి , సంగీత పాల్గొన్నారు.

నలంద ప్రీ పాఠశాలలో ఘనంగా పేరెంట్స్ డే

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో ని మామిడిపల్లి నలంద ప్రీ స్కూల్లో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. ఇందులో నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యల ప్రేమాభిమానుల మధ్య చిన్నారులు ఉపాధ్యాయులు అంతా ఆటపాటలతో నలంద ప్రాంగణం శోభాయమానంగా జరిగింది. ఇందులో గ్రాండ్ పేరెంట్స్‌కు మ్యూజికల్ చైర్, టీకప్స్‌తో ఆటలు నిర్వహించారు. ఇందులో గెలిచిన గ్రాండ్ పేరెంట్స్‌కు బహుమతులు నలంద యాజమాన్యం అందజేశారు. కార్యక్రమంలో ప్రీస్కూల్ టీచర్స్ అరుంధతి, హర్ష నిహారిక, శ్రావణి విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుర బాల్ బ్యాట్మింటన్ శిక్షణ శిబిరం ప్రారంభం



శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులు

నవతెలంగాణ-మాక్లూర్

జూనియర్ బాలుర బాల్ బ్యాట్మింటన్ నిజామాబాద్ జిల్లా జట్టు శిక్షణ శిబిరాన్ని ఎంపీపీ మస్త ప్రభాకర్, స్థానిక సర్పంచ్ చింత మల్లారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈనెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ బోనకల్లు ఖమ్మం జిల్లాలో జరిగే 67వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర, బాలికల, బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు ఎంపికైన నిజామాబాద్ జిల్లా బాలుర జట్టుకు మండలంలోని మామిడిపల్లిలో గ్రామంలో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు మానస గణేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాము, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు సుదర్శన్, క్యాషియర్ భూపతి రాజేశ్వర్, బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణమూర్తి, స్థానిక పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు భారతి, వినోద్, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండ లంలోని చౌట్‌పల్లి గ్రామ శివారులోని ప్రసిద్ధ శైవ క్షేత్రం ప్రత్యంగిరా కోటి లింగేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం పుష్య పౌర్ణమి ఆర్ద్ర నక్షత్రం సందర్భంగా నందిపేట పలుగుట్టకు చెందిన శ్రీ బాలయోగి మంగి రాములు మహరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘ మాసంలో జరుగబోవు అఖిల భారత సాధు పరిషత్ సమ్మేళనం, పుష్కర కుంభాభి షేకం ఆహ్వాన పత్రికను ప్రత్యంగిరా కోటి లింగేశ్వర స్వామి దేవస్థానం ఆలయ వ్యవస్థాపక నిర్మాణ ధర్మ కర్త గంగా ప్రసాద్ దీక్షితులు దంపతులు, కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వివిధ క్షేత్రాలు, పంచారామాలు, శక్తీ పీఠాల నుంచి వచ్చిన వేద పండితులు, తదితరులు పాల్గొన్నారు.

పశుమిత్రులకు రూ.26 వేల వేతనం చెల్లించాలి

- సీఐటీయూ డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

రాష్ట్ర పశువర్ధక శాఖ పరిధిలో పనిచేస్తున్న పశుమిత్రులకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం పశుమిత్ర యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌సెంటర్ పరిధిలోని పశువులకు రాత్రనకా, పగలనకా వైద్య పరమైన సాయం చేస్తున్నారని తెలిపారు. కృత్రిమ గర్భధారణ వ్యాక్సిన్ టీకాలు, నట్టల నివారణ మందు, గాలికుంటు, నీలినాలుక, పోచమ్మ దొబ్బ వ్యాధి నివారణ టీకాలతో పాటు అనేక రకాల సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. అయినా వీరికి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి వారితోషం లేకుండా పశు మిత్రులతో ప్రభుత్వం పెట్టి చాకిరి చేయించు కుంటుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యత తీసుకొని వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజనర్సు, శ్రీలత, రజిని, రోజా తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేపట్టిన నాయకులు, పశుమిత్రులు

బడి మానేసిన పిల్లల గుర్తింపు

నవతెలంగాణ-గాంధారి/లింగంపేట్

గాంధారి మండలంలోని వివిధ గ్రామంలో శనివారం ఓఎస్‌సీ సర్వే చేపట్టారు. దీంట్లో భాగంగా 7వ తరగతి చదివి బడి మానేసిన లొంకా తండాకు చెందిన బానోత్ దినేశ్‌ను గుర్తించి పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రంగా వెంకటేశ్వర గౌడ్, సిఆర్‌పిలు ప్రకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట్ మండలంలో..

లింగంపేట్ : లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం బడి బయట పిల్లలు గుర్తించి స్థానిక స్కూళ్లల్లో చేర్పించినట్టు సీఆర్పి గంగాధర్ తెలిపారు. మండలంలోని లింగంపల్లి, నల్లమడుగు తండా, కొయ్య గుండు తండా , బాయంపల్లి గ్రామాలలో బడి బయట పిల్లలు ఇతర పనులు చేస్తున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. నలుగురిని గుర్తించి సంబంధిత పాఠశాలలో చేర్పించినట్టు తెలిపారు. అనంతరం వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. ఈనెల ఆరో తేదీ నుండి 18వ తేదీ వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో బడి బయట పిల్లల సర్వే కొనసాగుతుందన్నారు. బడి బయట పిల్లలను పనుల్లో పెట్టుకున్నట్లయితే వారి చేత ఇతర పనులు చేయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో విజయ్ కుమార్, సత్యనారాయణ, సంఘ గౌడ్, పరమటి రాజు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలమీదకు తెస్తున్న పతంగి మాంజా



- గాలిపటాలతో బైక్‌పై వెళ్తున్న వారికి ప్రమాదాలు
- సంక్రాంతి పండుగ నేపథ్యంలో గల్లీల్లో పతంగుల జోరు

నవతెలంగాణ-భిక్కనూర్

పతంగులు ఎగురవేసేందుకు ప్రస్తుతం ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ (చైనా) మాంజా పలువురి ప్రాణాల మీదకు తెస్తుంది. గాలిపటాల మాంజా తెగిపోయినప్పుడు రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతు న్నారు. దీంతో పాటు గాలిపటాలు ఎగురవేసే సమయంలో వేళ్లు కోసుకుపోతున్నాయి. అధికార యంత్రాంగం స్పందించి ప్లాస్టిక్ మాంజాను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.



చిన్నారుల దగ్గర నుండి యువకులు, పెద్దమనుషులు సంక్రాంతి పండుగ వస్తుంది అనగానే గాలిపటాలు ఎగురవేసి ఆనందం పొందుతుంటారు. గతంలో దారం పోగులతో తయారు చేసిన మాంజాను విరివిగా ఉపయోగించు కునేవారు. కానీ ప్రస్తుతం ప్లాస్టిక్ మాంజా రాకతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గాలిపటాలు ఎగురవేసే క్రమంలో అవి తెగిపోయి రహదారిపై వెళ్తున్న వాహనదారుల మెడకు చుట్టుకుంటున్నాయి. దీంతో వాహనదారుల గాలిపటాల మాంజాల కారణంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. పలువురుకి మెడ వద్ద కోసుకున్న ఘటనలు సైతం చోటుచేసుకున్నాయి.

భిక్కనూర్ మండల కేంద్రంలో ఇటీవల కాలంలో ఓ యువకుడు తన పనులను ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న సమయంలో మాంజా వచ్చి మెడకు కోసింది. దీంతో తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. దీంతో ప్రాణాప్రాయం తప్పింది. వాహనం నెమ్మదిగా వెళుండటంతో కొంత మేర కోసుకుపోయిందని, వేగంగా ఉంటే మాత్రం ప్రాణాలు పోయేవని స్థానికులు పేర్కొన్నారు.

గాలిపటాలు ఎగురవేసే క్రమంలో దారాలు మాత్రమే ఉపయోగించేలా అవగాహన కల్పించాలని, ప్లాస్టిక్ మాంజా విక్రయాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సాగు మెళకువలపై రైతులకు అవగాహన



సాగులో నూతన పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-భిక్కనూర్

పంటల సాగులో మెళకువలపై మండలంలోని రామేశ్వరపల్లిలో శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతుల వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలు రైతులకు వివరించారు. భూమిలో భాస్వరం కరిగించే పి ఎస్ పి విధానాన్ని రైతులు అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అఖిలేష్, రైతుబంధు గ్రామ కన్వీనర్ తక్కల బాపురెడ్డి, పాలకేంద్ర అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, రైతులు, రాజిరెడి రెడ్డి, నవీన్, మదుసుదన్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సహాయం చేయడం గొప్ప విషయం



మాట్లాడుతున్న ఎంపీపీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సహాయం చేయడం గొప్ప విషయమని, మారుమూల గ్రామాల్లోని గిరిజన తండాలో ఎన్‌ఆర్‌ఐ ఎర్రం నవీన్ (యుఎస్‌ఎ) ఇందల్‌వాయి మండలంలోని గండితండా మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒకజత స్పోర్ట్స్ డ్రెస్, ఈ విద్య సంవత్సరానికి విద్యార్థులకు ఉదయంవేళ అల్పాహారం కోసం రూ.45వేలు ఆర్థిక సహాయాన్ని ఎంపీపీ బాదవత్ రమేష్‌నాయక్ చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఐ నవీన్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. దాతలు తాండాలలోని పాఠశాలలకు తమవంతుగా సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమానికి కృషిచేసిన ప్రధానోపాధ్యాయులు బండి పరమేశ్వర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమార్, పాఠశాల చైర్మెన్ రవి, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏ లోకి మార్చాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

జీఓ నెం. 15 అమలు చేసి ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో మండల ముదిరాజ్ సంఘ సభ్యుల సమావేశం నిర్వహించారు. రూ.2000 వేల కోట్లతో ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిబ్రవరిలో ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ముదిరాజ్‌ల ఐక్యత కోసం నెల మొదటి వారంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ముదిరాజ్ యువత, మహిళలు, గ్రామాలవారుగా తరలి రావాలని కోరారు. రాజకీయ పార్టీలు ముదిరాజ్ లను ఓటు బ్యాంకుగా ఉపయోగి స్తుంది తప్పా ముదిరాజ్ లకు ఎలాంటి ప్రయోజన లు చేయటం లేదని విమర్శించారు. ప్రతి ఒక్క రాజకీయ పార్టీలకు కనువిప్పు కలిగేలా ఫిబ్రవరి మొదటి వారంలో ముదిరాజుల భారీ సభ నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్య నారాయణ, ప్యాలల రాములు , కోర్న నారాయణ, ఎగుల నర్సింహులు , సాయిరాం, సంతోష్, శ్రీకాంత్, సతీష్ ఎల్లయ్య గంట సాయిలు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విఠల్

కమీషన్‌ల కోసం నా నిధుల విక్రయం

- జడ్పీ చైర్మన్‌పై జడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి ఆరోపణ

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

తనకు రావాల్సిన జిల్లా పరిషత్ నిధులను రానీవ్వకుండా జిల్లా పరిషత్ చైర్మన్ కమీషన్ల కోసం అమ్ముకుంటుందని జడ్పీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి ఆరోపించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీలో లీడర్ నాగిరెడ్డి మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామారెడ్డి మండలంలోని నిధులను అమ్ముకున్న పర్వాలేదు కానీ అభివృద్ధి జరగాలని అన్నారు. డబ్బులు సంపాదించడానికి రాజకీయాల్లోకి రాలేదని, అధికార పార్టీలో ఉన్నారు కాబట్టే జెడ్పి చైర్మన్ అయ్యారని, లేదంటే తాను కూడా ఒక జెడ్పిటిసి మాత్రమే అని అన్నారు. జెడ్పీ సమావేశానికి ముందు మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, రైతు ఆత్మహత్య చేసుకున్న కుటుంబానికి 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని టీషర్టుతో జిల్లా స్థాయి సంఘ సమావేశానికి హాజరై నిరసన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న జడ్పీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి

దహన సంస్కారాల కోసం ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన రాచర్ల శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతు శనివారం ఉదయం మృతి చెందడంతో మృతుడు నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో దహనసంస్కారాల కోరకు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి తనవంతు సాయంగా రూ.5వేలు బాధిత కుటుంబానికి ఫోన్‌పే ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు భూమేశ్వర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

కేసీఆర్ సేవాదళ్ కన్వీనర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ కేసీఆర్ సేవాదళ్ కన్వీనర్ కోర్వ దేవేందర్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్‌తో పాటు నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఐడీసీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్‌తో కలిసి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తిర్మల్‌రెడ్డి, గంగన్న, ప్రవీణ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న యువతీయువకుల ఉపన్యాసాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి (పరాక్రమ్ దివస్) సందర్భంగా జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు సుభాష్‌నగర్‌లోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమ ప్రారంభంలో జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్, ఆకాశవాణి అధికారి మోహన్ దాస్ నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి ఉపన్యాస పోటీలను ప్రారంభించారు. వివిధ మండలాల నుంచి పాల్గొన్న 22 మంది యువతీయువకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ గురించి ఉపన్యాసాలు చేశారు. 5నిమిషాల గడువులో నేతాజీ గురించి ఎన్నో కొత్త కొత్త విషయాలను ప్రస్తావిస్తూ ఎంతో ఉత్సాహంగా స్ఫూర్తివంతమైన విషయాలను పంచుకున్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగాలుగా వ్యవహరించిన జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్, మోహన్ దాస్ ఈ పోటీల విజేతను ప్రకటించారు. నిజామాబాద్ నగరంలోని గాజుల పేటకు చెందిన దాకాయి మాల్యద ప్రథమ స్థానంలో గెలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. గెలుపొందిన మాల్యదను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది లత, హరీష్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు అందజేత

కోర్టు ప్రొసీజర్, నూతన చట్టాలపై సమావేశం



మాట్లాడుతున్న నరేందర్

నవతెలంగాణ-ఆర్మూర్

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూ షన్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నరసయ్య ఆదేశాను సారం పట్టణంలోని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంకే నరేందర్ కార్యాలయంలో డివిజన్‌లోని సీఐ, ఎస్‌ఐలతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంకే నరేందర్ మాట్లాడుతూ.. చట్టాలపై, కోర్టు ప్రొసీజర్, కొత్తగా వివిధ కోర్టులు ఇచ్చిన చట్టాలు, రూలింగ్‌పై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆవారి రమేష్ పాల్గొన్నారు.

వలస కూలీలకు టీషర్టులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్



మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో లయన్స్ సహారా ఆధ్వర్యంలో సూర్య భగవాన్ ఫంక్షన్ హాల్లో 60 మంది బీహార్ నుంచి వచ్చిన వలస కూలీలకు టీ షర్టు లను శనివారం అందజేశారు. సూర్య భగవాన్ తండ్రి చేకూరి రాఘవులు జ్ఞాపకార్థం వారికి వీటిని అందజేసి నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ వి శివాజీ, ఏరియా కోఆర్డినేటర్ కథా ఆగర్వాల్, కోశాధికారి ధనంజయరెడ్డి, సభ్యులు వివేక్, నర్సింగ్ రావు, సుభాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా తెలంగాణ పురపాలక, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును హైదరాబాదులో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సైతం అర్బన్ ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ అభివృద్ధి పథంలో ఉండాలని ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని సూచించారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీనివాస్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నరేంద్ర మోడీ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య కార్మిక పోరాటాలను తీవ్రం చేద్దామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీనివాస్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ మహాసభల సందర్భంగా నిజామాబాద్ నగరంలో ముదిరాజ్ సంఘం ఫంక్షన్ హాల్‌లో ప్రాంతీయ సదస్సును బి.భూమన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని టీ.శ్రీనివాస్ మాట్లాడుతూ.. మోడీ ఎన్నికల వాగ్దానాలను విస్మరించి, దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మివేసి, ప్రజా సంపదను కొద్దిమంది చేతుల్లో పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వదేశీ పరిశ్రమలను రక్షిస్తానని, ఉపాధి రక్షణకై ఉద్యమిస్తానని మాట ఇచ్చిన మోడీ, ప్రతి ఏటా రెండు కోట్ల కొలువులు ఇస్తానని మాటిచ్చి నేడు ఉన్న కొలువులను ఊడ



మాట్లాడుతున్న టి.శ్రీనివాస్

పీకుతున్నారని ఆయన అన్నారు. దేశంలో 39కోట్ల మంది కార్మికులకు ఎలాంటి కార్మిక చట్టాలు అమలుగాక దినదిన గండం బతుకు గడవడం సుడిగండంగా మారిందని ఆయన అన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి, కార్మిక హక్కులను హరించి, కంపెనీ యజమానులకు లబ్ది చేకూర్చారని ఆయన తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వెంటనే ఆపాలని, 2016 అక్టోబర్ 26న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమానపనికి సమానవేతనం వెంటనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ.. దేశమును ప్రేమించమన్నా మంచి అన్నది పెంచుమన్నా అనే మాటలు చెప్పిన మోడీ, అమిత్‌షాలు కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించి, దేశంలో ఆకలి, నిరుద్యోగం, అసమానతలు పెంచుతున్నారని అన్నారు. మత విద్వేషాలు పెంచి, సామాజిక సమస్యలను విస్మరించి, దేశ ప్రజల మధ్య చీలిక తెచ్చి కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్నారని ఆయన అన్నారు. కులం, మతం కాదు కూడు, గూడు కావాలని, ఉపాధి అవకాశాలు పెంచాలని ఉద్యమించాలని అన్నారు. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, విశాల ఐక్యవేదిక ద్వారా పెద్ద ఎత్తున ఉద్యమాలు నుంచి మోడీ సర్కార్కు కనువిప్పు కలిగించాలని పాపయ్య పిలుపునిచ్చారు. ఈ సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ భూమేశ్వర్, రాష్ట్ర కార్యదర్శి దాసు, రాష్ట్ర నాయకులు సూర్య శివాజీ, శివకుమార్, హరిత, ఆకుల రాములు, ఎండి ఖాజా మొయినుద్దీన్, ఆకుల రాములు సదస్సులో ప్రసంగించారు. అరుణోదయ జిల్లా కార్యదర్శి అబ్దుల్, రంజిత్, చిట్టి, సత్యనారాయణ, నిజామాబాద్ జన సాంస్కృతిక కళావేదిక కన్వీనర్ సిర్ప.లింగయ్య, పాటలు పాడారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు మురళి, జేపీ గంగాధర్, నీలం సాయిబాబా, ఎల్బీ రవి, అల్తాఫ్, దాల్ మాల్కి పోశెట్టి, ఆశన్న, సుంకర శ్రీను, ఇందూరు రాజయ్య, భారతి, పద్మ మోహన్, సొప్పరి గంగాధర్, నిర్మల్ వెంకటేష్, చిట్టక్క, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బూత్ కమిటీల నియామకం

నవతెలంగాణ-డిచ్‌పల్లి/సిరికొండ

ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశానుసారం జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ మోహన్ సూచన మేరకు డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి, ఖిల్లా డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి, డొంకల్ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీలను నియమించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ మండలాధ్యక్షులు చిలివేరిదాస్, శ్రీనివాస్‌రెడ్డి, దాసరి లక్ష్మి నర్సయ్య, శక్కరికొండ కృష్ణ, పాశంకుమార్, నీరడి పద్మారావు హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేష్, ఎంపీటీసీ బాబురావు, మండల సెక్రెటరీ పులి శ్రీనివాస్, సీనియర్ నాయకులు గడ్కోలు శ్రీనివాస్, నారాయణరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నడ్పన్న, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దండవుల సాయిలు, నల్లవెల్లి సాయిలు, యూత్ అధ్యక్షుడు అమీర్‌ఖాన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రమోద్, రవి వర్మ బాబన్న, ఫైజల్ పాషా, పులి వసంత, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీ ఎన్నిక కోసం ఓటర్ లిస్ట్ అందజేత..

సిరికొండ : బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీ ఎన్నిక కొరకు చీమన్‌పల్లి యువత ఓటర్ లిస్ట్‌ను బీఆర్ఎస్ సిరికొండ మండలాధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్, స్థానిక ఎంపీపీ సంగీత రాజేందర్‌కు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పద్మ శివారెడ్డి, పందిమడుగు సర్పంచ్ బాగ్యా గంగానర్సయ్య, యూత్ మండలాధ్యక్షుడు చిగురు శ్రీనివాస్, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు గౌస్ బాషా, ఐటీ సెల్ మండలాధ్యక్షుడు మహేందర్, చీమన్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బుక రాజు పాల్గొన్నారు.

యాదవ సంఘానికి ఐదు లక్షలు మంజూరు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గాం గ్రామానికి చెందిన యాదవ సంఘానికి రూ.5లక్షలు మంజూరైనట్టు సర్పంచ్ పార్థవాని సాయిరెడ్డి, ఉప సర్పంచ్ ఫిరోజ్ ఉద్దీన్ తెలిపారు. శనివారం యాదవ సంఘం నాయకులకు మంజూరు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్, ఎమ్మెల్సీ కవితకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెంజల్ సింగిల్ విండో చైర్మన్ ఎస్.కె మొహినుద్దీన్, టీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు లక్ష్మణ్, డైరెక్టర్ కదిర్ పాషా, పార్థరాజు, చీరడి రవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో దుప్పట్లు పంపిణీ



పంపిణీ చేసిన దుప్పట్లతో విద్యార్థులు

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో స్థానిక జడ్పీటీసీ మలవత్ మాన్‌సింగ్ నాయక్, ప్రధానోపాధ్యాయులు ఎస్.కల్పన విద్యార్థులకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం జడ్పీటీసీ మాట్లాడుతూ ట్రైబల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో 186 దుప్పట్లు సరఫరా చేశారని, చలికాలంలో విద్యార్థులకు చలి తీవ్రత ఉండటంతో ప్రతి సంవత్సరం అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సునీత, దేవి సింగ్, శివరాం, ప్రశాంత్, జాకీర్ హుస్సేన్ విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ పునరుద్ధరణ కోసం సంతకాల సేకరణ

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి రైల్వేస్టేషన్ పునరుద్ధరణ కోసం పోచారం గ్రామంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ప్రతినిధుల సమక్షంలో శనివారం నిర్వహించారు. అఖిల భారత ప్రగశీల రైతు సంఘం జిల్లా నాయకులు గుమ్మల గంగాధర్ సంతకాల సేకరణలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చాలా రోజుల నుంచి ఈ రెండు రైల్వే స్టేషన్లను ఎత్తివేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు షేక్ నసీర్, కె.రవి, మండల నాయకులు సిద్ధ పోశెట్టి, గంగన్న గుడుసాబ్, అల్వాల శీను, వైద్యనాథ్, చాకలి గంగారం, గ్రామస్తులు పాల్గొని సంతకాల సేకరించారు.

క్రీడ మైదాన స్థలం పరిశీలన

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని ధర్మారం తండా, శాస్త్రినగర్, గుండారం, గాంధీనగర్ గ్రామాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసేందుకు స్థలాలను తహసీల్దార్ అనిల్, ఎంపీడీవో మల్లేశం, ఎంపీవో మధురిమ, జెడ్పీ సీఈవో గోవింద్‌నాయక్, ఏపీవో పద్మ శనివారం పరిశీలించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్సీ వీజీ గౌడ్ పలువురు బాధితులకు శనివారం అందజేసినట్టు కేశ్‌పల్లి సర్పంచ్ మహేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు, ఎంపీపీ కుంచాల విమల రాజు, సర్పంచ్ మహేశ్వర్, ఇందల్వాయి వైస్ ఎంపీపీ అంజయ్య, నాయకులు కోమిరే రాజు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజంలో నిజం ఉండాలి

- ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా
- నవతెలంగాణ-2023 క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నవీపేట్

జర్నలిజంలో నిజం దాగి ఉంటేనే ప్రజల విశ్వాసాన్ని పొందుతారని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ సతీమణి ఆయేషా ఫాతిమా అన్నారు. మండల కేంద్రంలో నవతెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్‌ను వివిధ పార్టీల ప్రతినిధులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా రాయడంలో నవతెలంగాణ ముందు వరుసలో ఉందని అన్నారు. అబద్దాలను సైతం వార్తల పేరుతో విపరీత ప్రచార ధోరణి కొనసాగుతుండడం సమాజంలో జర్నలిజం పట్ల విశ్వాసాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఇటువంటి పరిస్థితులు మారాలని సూచించారు. ప్రపంచంలోనే కుల మతాలకు అతీతంగా భారతదేశంలో లౌకికతత్వం కొనసాగడం అందరికీ గర్వకారణమని అన్నారు. సమాజంలో ప్రజా గొంతుకగా ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చేందుకు నవతెలంగాణ అనుదినం జనస్వరంగా పనిచేస్తుందని ఉమ్మడి జిల్లా స్టాపర్ భాస్కర్ అన్నారు. మండలంలో అధికార యంత్రాంగాన్ని ప్రశ్నిస్తూనే రాష్ట్రంలో అణగారిన సామాజిక వర్గాలకు ఒక గొంతుకగా మారి 17 కులాల గుర్తింపుకై కృషిచేసి సామాజిక న్యాయాన్ని అందించడంలో నవతెలంగాణ పాత్ర కీలకమైందని, పత్రికలు వ్యవస్థల్ని ప్రశ్నిస్తేనే ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని ఈ విషయాన్ని రాజకీయ నాయకులు అర్థం చేసుకోవాలని నవీపేట్ విలేకరి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

జాదవ్ శరత్ అన్నారు. అనంతరం క్యాలెండర్ ఆవిష్కరించి మొదటి క్యాలెండర్‌ను చేతి పంపు మెకానిక్ హైమద్‌కు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్, సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్, జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, జడ్పీటీసీ సవిత బుచ్చన్న, బీఆర్ఎస్ మండల కన్వీనర్ నర్సింగ్ రావు, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి వడ్డే రవి, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నాయక్‌వాడి శ్రీనివాస్, జన చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు సంజీవ్ దేవేందర్ సింగ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-బోధన్

8న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్ అన్నారు. శనివారం సాలూర మండలం హున్స గ్రామంలో ధర్నాకు హాజరుకావాలని కోరుతూ కార్మికులను సమాయత్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికులు, సంఘాల కార్యకర్తలు, రైతులు, కూలీలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలు పునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపె డుతున్న ప్రజా వ్యతిరేక



మాట్లాడుతున్న ఏశాల గంగాధర్

విధానాలపై ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. అలాగే ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వివరించారు. ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు రోజుకు రూ.680 ఇవ్వాలని, ఉపాధి హామీలో సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని, వ్యవసాయ కూలీలకు పెన్షన్ ఇవ్వాలని, వ్యవసాయ కూలీలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇవ్వాలని, రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలని, పంట లకు గిట్టుబాటు ధరను కల్పించాలని, విద్యుత్ బిల్లును సవరించాలని, కార్మికులకు కనీసం నెలకు 21 వేల రూపాయల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో గాండ్ల సాయిలు, గాగ్రి సాయిలు, బాలేరావు కొండిబా, సింగడి సావిత్రి, తుడుమే ఎల్లవ్వ సింగడి లతా, గౌతం తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూకు పలువురు ఉపాధ్యాయుల ఎంపిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్‌పల్లి మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన పలువురు ఉపాధ్యాయులను పీఆర్టీయూ సంఘం జిల్లా, రాష్ట్ర బాధ్యులుగా ఎంపికచేసినట్టు పీఆర్టీయూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చందు, అంజద్ సుల్తానా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా హసకొత్తూరు ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీనివాసమూర్తి, నర్సాపూర్ పాఠశాలకు చెందిన రాధ కిషన్, జిల్లా ఉపాధ్యక్షుడిగా కోన సముందర్ పాఠశాలకు చెందిన గణేష్, మండల అసోసియేట్ అధ్యక్షులుగా జ్ఞానేశ్వర్లను నియమిస్తూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు. సంఘ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం ఆధ్వర్యంలో కృషి చేస్తామని, ఈ సందర్భంగా నూతనంగా నియమింపబడ్డ ఉపాధ్యాయులు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి పదవులు అప్పగించినందుకు జిల్లా, రాష్ట్ర బాధ్యులకు నూతనంగా నియమింపబడ్డ ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

10 నుంచి కబడ్డీ టోర్నమెంట్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

కేసీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో పురుషులందరికీ నిజామాబాద్ పార్లమెంట్ స్థాయి కబడ్డీ టోర్నమెంట్ 2023 పోటీలను డీఎస్సీ మినీ స్టేడియంలో (కలెక్టర్ గ్రౌండ్)లో ఈనెల 10, 11, 12 తేదీల్లో పోటీలను నిర్వహించనున్నట్టు నాయకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతిగా 50,000, రెండో బహుమతిగా 30,000, మూడో బహుమతిగా 10,000 ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాజట్లు ఈ నెల 9వ తేదీ సాయంత్రం వరకు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9866770889 నెంబర్‌నుసంప్రదించాలని సూచించారు.

9న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 9వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో గోపాలకృష్ణ తెలిపారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కె.శ్రీనివాస్ అధ్యక్షతన ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీవైస్ చైర్‌పర్సన్‌తో పాటు మండల, డివిజన్, జిల్లాస్థాయి సంబంధిత వివిధ శాఖల అధికారులు సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు. వచ్చేముందు సంబంధిత అధికారులు ప్రగతి నివేదికలను తమ వెంట తీసుకురావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



బోధన్‌లో..

నవతెలంగాణ-బోధన్/కమ్మర్‌పల్లి/ఆర్మూర్

రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన వాటిని సమర్థవంతంగా నిర్వహించడానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ సూచించారు. శనివారం బోధన్ పట్టణంలోని రవి గార్డెన్‌లో బోధన్ నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో బండి సంజయ్ వర్చువల్ విధానంలో నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో బోధన్ నియోజకవర్గ పాలక్ మల్లారెడ్డి, ప్రభారీ నందరెడ్డి, బోధన్ నియోజకవర్గ సీనియర్ నాయకులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డీ మోహన్‌రెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, బోధన్ పట్టణ అధ్యక్షులు బాలరాజు, జడ్పీటీసీ మేక విజయ, ఎంపీపీ రజిత, మాజీ ఫ్లోర్ లీడర్ రామరాజు, నియోజకవర్గ నాయకులు శ్రీధర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ నియోజకవర్గ బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనం

కమ్మర్‌పల్లి : బాల్కొండ నియోజకవర్గ బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనాన్ని మండల కేంద్ర శివారులోని లలిత గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాతో జరిగిన బూత్ సభ్యుల సమ్మేళనం వర్చువల్ సమావేశానికి సంబంధించి సన్నాహక సమావేశంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బాల్కొండ నియోజకవర్గ పాలక్ పవార్ రామారావు పటేల్, బాల్కొండ నియోజకవర్గ ప్రభారి కరండ్ల మధుకర్, డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.

పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల సమావేశం

ఆర్మూర్ : బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల మహా సమ్మేళనంలో భాగంగా పట్టణంలోని ఎమ్మార్ గార్డెన్ నందు శనివారం నియోజకవర్గ పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో సభాధ్యక్షులుగా నియోజకవర్గ కన్వీనర్ పాలెపు రాజు, ముఖ్యఅతిథిగా నియోజకవర్గ పాలక్ అప్పాల గణేష్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో వైద్య శిబిరాలను సమర్థవంతంగా నిర్వహించాలి

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం జనవరి 18 నుంచి గ్రామాలలో రోగుల సౌకర్యార్థం చెవి, దంత, కంటి వైద్య పరీక్షల కోసం నిర్వహించే వైద్య శిబిరాలను వైద్య సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని శిక్షణ శిబిరం ప్రతినిధులు అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ బస్తి దావఖానలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందికి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ ప్రతినిధులు కృష్ణవేణి, దేవపళ, మేరి విజయ్ కుమారి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఈ వైద్య శిబిరాలలో దంత సమస్యలు, వాటి సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గ్రామస్తులకు వివరించాలని సూచించారు. అలాగే దంత చికిత్సలపై సూచనలు చేశారు. చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన సమస్యలపై, వాటికి అందించే వైద్య సేవలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అలాగే కంటి సమస్యలు వాటి చికిత్సలపై తీసుకోవలసిన జాగ్రత్తలు శిబిరంలో అందించే కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రిప్టోగ్రాఫితో సమాచార భద్రత

- టాస్క్ సీఈఓ శ్రీకాంత్

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామ క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో రెండు రోజుల వర్క్ షాప్‌ను ఆ విద్యాసంస్థల చైర్మన్ శ్రీ అల్జాపూర్ శ్రీనివాస్ శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ క్రిప్టోగ్రఫీ సబ్జెక్టు పురాతన కాలం నుంచి ఉపయోగంలో ఉందని, ఆ కాలంలో క్రిప్టోగ్రఫీని రాజులు, గూఢచారులు తాము రాసిన లేఖలను ఇతరులకు అర్థం కాకుండా ఉండేందుకు వాడేవారని అన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ సింహా మాట్లాడుతూ.. క్రిప్టోగ్రఫీ ఆధునిక యుగంలో క్రిప్టోగ్రఫీ కంప్యూటర్ సైన్స్‌లో ఉపయోగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో క్షత్రియ విద్యాసంస్థల సెక్రటరీ అల్జాపూర్ దేవేందర్, కోశాధికారి అల్జాపూర్ గంగాధర్, కోకన్వీనర్ కృష్ణ చైతన్య, కంప్యూటర్ సైన్స్ డిపార్ట్మెంట్ హెడ్ లక్ష్మణ్, ఇతర విభాగాల అధిపతులు, ఉపాధ్యాయులు వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) నిజామాబాద్ జిల్లా కమిటీ 2023 సంవత్సరం క్యాలెండర్‌ను నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ విద్యారంగ సమస్యల, సమాజంలో జరుగుతున్న అన్ని సమస్యలపైన నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంలో విద్యార్థులు చేరాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం, జిల్లా అధ్యక్షురాలు అంజలి, జిల్లా గర్ల్స్ కన్వీనర్ అంకిత, జిల్లా సహాయ కార్యదర్శి కుశాల్, జిల్లా కమిటీ సభ్యులు సుభోద్, దినేష్, సోనియా, అంజలి, మమతా, నిత్య తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో స్కూల్ ప్రహరీ గోడ నిర్మాణానికి ఎంపీపీ కుంచాల విమల రాజు భూమిపూజ చేసినట్టు మండల కోఆప్షన్ మెంబర్ బుల్లెట్ అక్బర్‌ఖాన్ తెలిపారు. మండల ప్రజా పరిషత్ నిధుల నుంచి 1,50,000లతో స్థానిక స్కూల్ ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి భూమి పూజ చేసినట్టు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, సర్పంచ్ లతా దేవరాజ్, ఎంపీటీసీ పోతే రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్ మైనార్టీ గురుకుల పాఠశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల (ఇ.మీ)లో ఆలూరులో 2023-24 సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (బైపీసీ అండ్ ఎంపీసీ) నూతన ప్రవేశాలు 6వ తరగతి నుంచి 9వ తరగతి మిగులు సీట్లు భర్తీకై దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సయ్యద్ హైదర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

'శ్రీ భాషిత'కు జాతీయస్థాయి అవార్డు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీ భాషిత పాఠశాలకు వినూత్నమైన రీతిలో బోధన చేపట్టినందుకు గానూ జాతీయస్థాయి అవార్డు లభించింది. హైదరా బాద్‌లోని హైటెక్స్‌లో పదవ జాతీయ సమ్మేళనం సందర్భంగా శ్రీ భాషిత పాఠశా లకు జాతీయస్థాయిలో బహుమతి వచ్చింది. ఈ బహుమతిని శ్రీ భాషిత పాఠశాల చైర్మన్, పోలపల్లి సుందర్, పాఠశాల డైరెక్టర్ పోలపల్లి సుమాలిని, ఫ్లోర్ ఇంచార్జ్ గట్ల రేఖ, ప్రముఖ సినీ నటుడు మురళీమోహన్ తదితరుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు.



అవార్డు అందుకుంటున్న దృశ్యం

ఖండ్గాం గ్రామంలో యువకులకు హెల్మెట్లు పంపిణీ

నవతెలంగాణ-బోధన్

మండలంలోని ఖండ్గాం గ్రామంలో కరుణన్న యువసేన ఆధ్వర్యంలో యువకులకు హెల్మెట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కరుణన్న యువసేన నాయకులు మాట్లాడుతూ.. నేటి కాలంలో ప్రతి వ్యక్తి ప్రాణాలు ఎంతో విలువైనవని కావున ప్రతి ఒక్కరూ హెల్మెట్లను ధరించి ప్రయాణం కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భాస్కర్‌రాజ్, ఖలీల్ ఉల్లా, రాజేశ్వర్ పటేల్, మోసిన్, దత్తు, మల్లికార్జున్, అబ్బయ్య యువకులు తదితరులు పాల్గొన్నారు.